నిధులు కేటాయించాలని ఎంపీకి వినతి

కుత్బుల్లాపూర్: బీజేపీ సూరారం డివిజన్ అధ్యక్షుడు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో సంజయ్ గాంధీ నగర్‌లో వివేకానంద కమ్యూనిటీ హాల్ నిధుల విడుదల కోసం ఎంపీ ఈటల రాజేందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, భద్రప్ప చారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ కాలనీల సభ్యులు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. వెంటనే స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

బోనాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నిజాంపేట్: తన కూతురు ఇంట్లో జరిగే బోనాల వేడుకకు బయలుదేరిన ఓ మహిళ రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఆపై కారు ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన రేణుక (43) శుక్రవారం తన కూతురు ఇంట్లో జరిగే బోనాల వేడుకకు బయలుదేరింది. ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ కళాశాల దగ్గర రేణుక రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైక్ ఆమెను మొదట ఢీ కొట్టడంతో కిందపడిపోయింది. ఆ తరువాత కారు సైతం వచ్చి బలంగా ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం

- వాహనదారులు, పాదచారులకు తిప్పలు
- పొంగిన డ్రైనేజీలు
- సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది



జీడిమెట్ల పారిశ్రామికవాడ రోడ్డును ముంచెత్తిన వరదనీరు

కుత్బుల్లాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై మోకాలు లోతు నీరు చేరడంతో వరదనీటిలో వాహనాలు మొరాయించాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి చెట్లు కుప్పకూలడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. వరదనీటికి తోడు డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు ఉప్పొంగాయి. ప్రధాన రోడ్లపై వరదనీరు వెళ్లేందుకు జలమండలి ఎమర్జెన్సీ రెస్క్యూ టీమ్ సభ్యులు వాటర్ డ్రెయిన్, మ్యాన్‌హోళ్ల మూతలను తెరిచారు.



సెల్లార్‌లో నీటమునిగిన ద్విచక్ర వాహనాలు



మహదేవపురంలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్



బీఆర్ఎస్ కార్యాలయం వద్ద కూలిన వృక్షం

పాఠశాలల్లో ఘనంగా బోనాలు



గండిమైసమ్మలోని రవీంద్రభారతి గ్లోబెల్ స్కూల్‌లో పోతరాజుల వేషధారణలో చిన్నారులు



ఎస్వీఆర్ స్కూల్ బోనాల ఉత్సవాల్లో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి, మహిళలు

కుత్బుల్లాపూర్: బోనాల ఉత్సవాల నేపథ్యంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం బోనాల పండుగ జరుపుకున్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎస్వీఆర్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి హాజరయ్యారు. అదే విధంగా గండి మైసమ్మ రవీంద్ర భారతి గ్లోబల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో చిన్నారులు పోతరాజుల వేషధారణలో సందడి చేశారు.

ప్రజలను మభ్య పెడుతున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: మున్సిపల్ నిధులను ప్రత్యేక నిధులు అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ అన్నారు. కొంపల్లిలో ఆయన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంలో ప్రతిపాదించిన పనులు మంజూరు కాగా వాటిని కాంగ్రెస్ నాయకులు తామే తీసుకువచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ చింతల దేవేందర్, మధు యాదవ్, గిరి యాదవ్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్న శ్రీశైలం యాదవ్

కాంగ్రెస్‌ది ప్రజా పాలన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్, కైసర్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.54 లక్షల నిధులు మంజూరు చేయించారు. స్థానికుల విన్నపం మేరకు శుక్రవారం స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న రోజుల్లో కైసర్ నగర్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహ్మద్ తౌసిఫ్ అహ్మద్, మహ్మద్ దావూద్, అబ్దుల్ జమీల్, మహ్మద్ జబ్బార్, మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.



కైసర్ నగర్‌లో పర్యటిస్తున్న శ్రీశైలం గౌడ్

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఎస్ కన్వెన్షన్ ఎదురుగా ఉన్న కేపీరెడ్డి నగర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద ఈ నెల 17న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా వేశారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు

నిజాంపేట్ : ప్రగతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ డాక్టర్స్ బృందం సంయుక్తంగా శుక్రవారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, ప్రముఖ సైంటిస్ట్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె.ప్రశాంత్ కుమార్‌లు కలిసి ప్రారంభించారు. జంక్‌ఫుడ్ తదితర ఆహార పదార్థాలు తీసుకున్న తరువాత సరైన పద్ధతిలో పళ్లను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు సీహెచ్ఎం చారి, కె.శంకర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండాపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పద్మానగర్ ఫేజ్ 2లో నివాసముండే పెండి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు వంశీకిషోర్‌రెడ్డి(21)15న ఉదయం 9 గంటలకు బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఆచూకీ కోసం ఆరా తీశారు. నేటి వరకు రాకపోవడంతో యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుట్టు మిషన్లు అందజేత

నిజాంపేట్ : ఇందిరా మహిళా శక్తి మైనార్టీ మహిళా లబ్ధిదారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శుక్రవారం నిజాంపేట్ టీఎంఆర్ఐఈఎస్ అండ్ జూనియర్ బాయ్స్ కళాశాల, హైదర్‌నగర్ పరిధిలో ఇందిరా మహిళా శక్తి ద్వారా అర్హులైన మైనార్టీ మహిళలకు మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో 200 కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికతో ఉందన్నారు.

